

# మౌన రాగం

కొంపెల్ల విశ్వం

**ప్రయాణంలో** నాకు ఎవరితోనూ మాట్లాడడం ఇష్టం ఉండదు. అలా అని నిద్రపోవడమూ ఇష్ట ముండదు. ఇష్టముండడం మాట అటుంచి, ఎంత దూరప్రయాణమైనా పట్టుమని ఒక గంటసేపు కుదురుగా పడుకోలేను.

ప్రయాణాల్లో నా స్నేహితు లెవరంటే, పుస్తకాలూ, నా మనస్సూను. చాలా మంది లాగే నా ఆలోచనలకు ఒక తీరు, తెన్ను ఉండదు. నేను చదువుకునే రోజులు, వెళ్ళిన ఇంటర్వ్యూలు, చేసిన ఉద్యోగాలు, స్నేహాలు, మా మామయ్య కూతురుతో నా ముచ్చట్లు, నా మీద బంధువుల దాడి, అంతలోనే ఏదో సినిమా కథ, రెండు సంవత్సరాల నించీ నా బుర్రలో దూరి నా చేత వ్రాయబడని నవల ప్లాటు, చేసిన అప్పులు, అర్జెంటు పనులు, పక్కసీటు ఆయన చేసే గురక వినటం, తిట్టుకోవటం, దానికి అల వాటు పడిపోవటం, అంతూ దరీ లేకుండా ఆలోచించటం — ఇలా ఉంటుంది ప్రయాణాల్లో నా పరిస్థితి.

నా పరిస్థితి ఇప్పుడూ అలాగే ఉంది. పైగా ఇందాకటి నించీ నన్నెప్పుడు పలకరించి, నాతో మాట్లాడదామా అని వేచి చూస్తున్నాడు ఎదుటి సీట్లో కూర్చున్న పెద్దమనిషి. ఇలా ఆలోచి స్తుండగానే పలకరించేడు.

"మీ రెంత వరకు వెడుతున్నారు?"

వినిపించుకోనట్టు వూరుకున్నాను నేను.

"మిమ్మల్నేనండీ, ఎంతవరకూ వెడు తున్నా రంటే మాట్లాడరేం?"

ఇక తప్పలేదు నాకు. చేతిలోని పుస్తకంలోకి అలా చూస్తూనే చెప్పాను.

"ఈ రైలెంతవరకు వెడుతుందో అంతవరకు."

ఆయన కొద్దిగా నవ్వి, "బాగానే ఉంది ... ఇదిగో చూడండీ —కేవలం మీరు ఏ వూరు వెడుతున్నారో తెలుసు కోవడం కోసమే నేను మిమ్మల్ని పలక రించా నంటారా?" అన్నాడు.

ఆయన అలా అన్నాక కూడా నే నేమీ మాట్లాడలేదు.

"పక్కవాడు పలకరించినా కూడా మాట్లాడకుండా అలా పుస్తకాల పురుగై పోతే ఎలాగండీ!" అంటూ కొద్ది పాటి చికాకుని కూడా ప్రదర్శించా డాయన.

సరే, ఇక తప్పేలా లేదని పుస్తకం మూసి, మళ్ళీ ఎవరికైనా ఇవ్వాల్సి వస్తుందని, వస్తే మన ప్రమేయం లేకుండా కంపార్ట్‌మెంటంతా తిరిగి ఆ పుస్తకం ఎవరితోనో ఏదో స్టేషన్‌లో దిగిపోతుందని బ్యాగ్‌లో పడేసి, ఒక చిర్నవ్వుని మొహం మీద పులుముకుని, "చెప్పండి. ఏం మాట్లాడ మంటారు?" అన్నాను.

"అలా అడిగారు, బాగుంది" అన్నాడు ముసలాయన. అనడమే కాదు, నన్ను వూదరగొట్టేశాడు — తన కబుర్ల తోటి. చిత్రమేమిటంటే, మితభాషినైన నేను కూడా ఆయనతో కలిసి సమా నంగా వాగాను. అయితే మేం ఇద్దరం కూడా ఒకరి వ్యక్తిగత విషయాల్లోకి మరొకరం పోకుండా పుస్తకాలు, సినిమాలు, రాజకీయాలు—ఇలా చాలా విషయాలు మాట్లాడుకున్నాం.

ఇంతలో మా కంపార్ట్‌మెంటులో చెకింగ్ జరిగింది.

టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్న వారిలో ముసలాయన ఒకడు.

నేను టిక్కెట్టు తీసుకున్నాను మొర్రో అంటాడు ముసలాయన. టిక్కెట్టు చూపించండి — నమ్ముతాను అంటాడు టి. సి. జనరల్ కంపార్ట్ మెంటులో కూడా చెక్కింగ్ ఏమిటి అంటూ సణుక్కుంటున్నారు కొందరు.

రైలు బయలుదేరే ముందు ముస లాయన క్యూలో నా కన్నా ముందు నించుని టిక్కెట్టు కొనుక్కోవడం స్పష్టంగా చూశాను. లేకపోతే అందరితో బాటు నేనూ అయన్ని అనుమానించే వాడిని. అంతేకాదు, ఇందాకటి నించీ నాతో హస్కు కొట్టింది కూడా నా సపోర్ట్ కోసమే అనుకునేవాడిని కూడా!

ఆ సంగతే టి. సి. తో చెప్పాను. కొంచెం మెత్తబడి అన్నాడు:

"నిజమే కావచ్చు, సార్. కానీ చివరి దాకా టిక్కెట్టు దాచుకోవాలా, వద్దా చెప్పండి?"

"దాచుకోవాలని నాకూ తెలుసండి. దాచుకున్నాను కూడాను! కానీ పోయింది. ఏం చేయమంటారు?" అన్నాడు ముస లాయన విసుగ్గా.

"ఏం చేయమంటా నండి? మళ్ళీ టిక్కెట్టు తీసుకో మంటాను" అన్నాడు టి. సి. వెంటనే.

"నా దగ్గర డబ్బు లేదండి."

"అయితే వచ్చే స్టేషన్‌లో దిగి పోండి."

[illegible] గజేసుకోకపోతే లాభం లేదనుకుని, "మీరే ఏదో అయిడియా చెప్పాలి కానీ, పాపం, ముసలాయన కదా—వచ్చే స్టేషన్‌లో దిగి పొమ్మంటే ఎలా చెప్పండి?" అన్నాను టి. సి.తో.

"అయ్యా, ముసలాయన కదా అని నేను ఆయన మీద జాలిపడితే, ఆ తర్వాత నా మీద జాలిపడే వా రెవరూ ఉండక పోవచ్చు. అందుచేత టిక్కెట్టు తీసుకోమనండి."

"డబ్బు సరిపో దంటున్నాను కదా!" గొణుక్కున్నాడు ముసలాయన.

ఆయన వద్ద ఎంతుందో కనుక్కుని, ఆ పై డబ్బు నేను వేసి టిక్కెట్టు కొనిపించాను.

టి. సి. వెళ్ళిపోయాడు.

ముసలాయన నా కింకా క్లోజయి పోయాడు.

నా సహాయాన్ని ఈ జన్మలో మరిచిపోలే నన్నాడు. అవ్‌ట్రాల్ రైల్లో పరిచయానికే ఇంత సహాయం చేసిన దాతృత్వాన్ని తన ఒక్క నోటితో వెయ్యి సార్లు పొగిడాడు. నాక్కూడా రాని

తెలుగు భాష అంతా ఖర్చు చేసి నన్ను, ఆకాశాని కెత్తేశాడు.

ఆ తర్వాత అనుకోకుండా సంభాషణ నా వ్యక్తిగత విషయాల మీదకు మళ్ళించాడు ముసలాయన.

''మీది వైజాగేనా!''

''అవునండి.''

''మీ రెంతమంది అన్నదమ్ములు?''

''ముగ్గురం. నేనే పెద్దాడిని. మిగిలిన ఇద్దరూ బాగా చిన్నాళ్ళు.''

''మీకు పెళ్ళయిందా?''

కాసే పాగి అన్నాను నేను:

''అయింది. రెండేళ్ళ అబ్బాయికూడా ఉన్నాడు.''

''అహా—అలాగా'' అని కాసేపు పూరుకుని, ''అడగకూడని ప్రశ్న ఒకటి అడగాలని ఉంది. అడగమంటారా?'' అన్నాడు.

''అడగండి'' అన్నాను నేను.

''ఏమీ అనుకోరు కదా!'' సంశయంగా అన్నా డాయన.

''పరవాలేదు, అడగండి.'' నవ్వుతూ అన్నాను నేను.

''మీరు చూస్తుంటే నెలకి ఏడెనిమిది వందలు సంపాదించే మనిషిలా కనిపిస్తున్నారు. మీ పెళ్ళికి ... కట్నం ఎంత తీసుకున్నారు?''

''ఏమీ తీసుకోలేదండి.'' వెంటనే అన్నాను నేను.

''నిజమే!'' నిజంగా ఆశ్చర్యపోయా డాయన.

''నిజమేనండి. అమ్మాయి ఏదో స్కూల్ఫైనల్ పాసయి సంసారపక్షంగా ఉంటే చాలు, కట్నం ఏమీ తీసుకోకూడదని మొదటినించీ అనుకునే వాడిని. అలాగే పెళ్ళి చేసుకున్నాను.''

ఆయన నన్ను మరేమీ ప్రశ్నించకుండా తన ఆలోచనల్లో తాను ఉండిపోయాడు.

కాసేపు బరువుగా కళ్ళు మూసుకున్నాను. ఒక పది నిమిషాల తరవాత చూస్తే ఆయన కండువాతో కళ్ళు ఒత్తుకుంటూ కనిపించాడు.

''ఏమిటండీ, కంట్లో ఏదైనా నలుసు పడిందా?'' అడిగాను నేను.

''ఆ— అదేనండీ— అదే.. అదే!'' అన్నాడు కంగారుగా. అందుచేత అది కాదనుకున్నాను నేను. ఏదో విషయం ఉందని కూడా అనుకున్నాను. కానీ నేను ఏమీ అడగలేదు.

ఆయన దిగాల్సిన వూరు వచ్చేదాకా నాతో ఏమీ మాట్లాడలేదు.

ఆయన దిగాక నేనుకూడా ప్లాట్ఫారమ్ మీదకు వచ్చాను.

''బాబూ! చిన్న మాట. నీ చిరునామా తీసుకుని నీ డబ్బు నీకు పంపించి వేస్తానని చెప్పి నిన్ను మోసగించలేను. నా ఆర్థిక పరిస్థితి అలాంటిది'' అన్నా డాయన.

''పరవాలేదులెండి, అదేమంత పెద్ద మొత్తమని?'' అన్నాను నేను.

''నువ్వు అలా అనక మరేమంటావు, బాబూ! కానీ ... నీ పెళ్ళి కాకముందు నువ్వు నాకు కనిపించి ఉంటే చాలా బాగుండేది, బాబూ!'' అన్నా డాయన. అని, ఎందుకో నేను అడగకుండానే చెప్పాడు కూడా.

''నాకు పెళ్ళి కావలసిన ఇద్దరాడపిల్లలున్నారు. నా పిల్లలని చెప్పడం కాదు కానీ, బంగారపు బొమ్మలు. ఏదో స్కూలుఫైనల్ దాకా చెప్పించాను. కానీ వాళ్ళిద్దరికీ పెళ్ళి చేయలేక నానా బాధపడుతున్నాను.''

ఆయన ఎందుకు బాధ పడ్డాడో నా కిప్పుడు పూర్తిగా తెలిసింది.

''ఇదిగో— ఈ కాగితం మీద నా చిరునామా ఉంది. నీ తమ్ముళ్ళు బాగా చిన్నవాళ్ళన్నావు. నీ కెక్కడయినా నీలాంటి మనిషి కనిపిస్తే అతని చిరునామా ఇస్తూ నాకు ఒక ఉత్తరం వ్రాయి'' అన్నాడు.

రైలు కదిలేదాకా ఏదేదో మాట్లాడుతూ అక్కడే నించున్నా డాయన. రైలు ముందుకు కదులుతూ, కదులుతూ నా కంట్లో ఒక నలుసుని పారేసింది.

నిజానికి నలుసు పడింది నా కంట్లో కాదు.

'ఆయన అన్ని అర్హతలు ఉన్న ఆడపిల్ల లిద్దరికి పెళ్ళి చేయలేక బాధపడుతున్నాడు. నిజమే! కానీ ఈ సమాజంలో ఆయన ఒక లాగ బాధపడుతుంటే, నేను మరొక లాగ బాధపడుతున్నానని ఆయన కెలా చెప్పగలను? నేను ఉద్యోగంలో చేరిన నెలకే నాన్నగారు రిటైర్ అయిపోయారని, ఇద్దరు తమ్ముళ్ళని పైకి తీసుకువచ్చే బాధ్యతతోబాటు, చెల్లాయి పెళ్ళి బాధ్యత కూడా నాదేనని, ఈ బాధ్యతలు తీరేసరికి బహుశా నాకు పెళ్ళి చేసుకునే అవసరమే ఉండదని, కుటుంబంలో ఎవరో ఒకరు త్యాగం చేస్తేనే కానీ మిగిలిన వాళ్ళు పైకి రాలేని సమాజం మనదని, పాతికేళ్ళ వయస్సు, మూడు పాతికేళ్ళ మనస్సు గల నేను ఆయన వూహని ముందుగానే గ్రహించి ఆయన కో తీయటి అబద్ధం చెప్పానని ఆ ముసలాయనకి? ఎలా చెప్పగలను, ఏమని చెప్పగలను

అందుకే నాలో నేనే . . . నాతో నేనే . . .'

*

